# మరింతగా ఐక్యత!

- కష్టకాల కుట్రలకు అదే పరిష్కారం
- కార్మికులకు కేరళ, ఢిల్లీ తరహా సాయం అందించాలి
- లాక్‌డౌన్ కాలాన్ని సిక్‌లీవుగా పరిగణించాలి
- ఇఎస్ఐ ద్వారా వేతనం చెలించాలి
- ప్రజాశక్తితో ఎంఎ గఫూర్

ప్రజాశక్తి- కర్నూలు ప్రత్యేక ప్రతినిధి

కరోనా వైరస్ విస్తృతంగా వ్యాపిస్తున్న ప్రస్తుత సమయంలోనే గతంలో ఎన్నడూ లేనంతగా కార్మిక వర్గ ఐక్యత అంశం ముందుకు వచ్చిందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గఫూర్ అన్నారు. మేడే సందర్భంగా ప్రజాశక్తికిచ్చిన ఇంట పనులు లేక, వేతనాలు అందక , భవిష్యత్‌పై ఆందోళనలో దేశవ్యాప్తంగా కార్మికులు చిక్కుకున్నారని, అదే సమయంలో కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని అన్నారు. పటిష్టమైన కార్మిక వర్గ ఐక్యత ద్వారానే కష్టకాలంలో జరుగుతున్న కుట్రలను తిప్పికొట్టగలమని చెప్పారు. ఇంటర్వ్యూ వివరాలు క్లుప్తంగా:

**ప్ర : గతంలో ఎన్నడూ లేని పరిస్థితుల్లో మేడేను జరుపుకుంటున్నాం. దీని ప్రాధాన్యత ఏమిటి?**

జ: కరోనా వైరస్ వ్యాప్తి, లాక్‌డౌన్‌ల కారణంగా గతంలో ఎన్నడూ లేని పరిస్థితులు దేశంలో నెలకొన్నాయి. రోజులు తరబడి పనులు లేక, వేతనాలు లేక కార్మికులు కష్టాల్లో చిక్కుకున్నారు. మరోవైపు అనేక సంస్థలు వేతనాల్లో కోత వేయడం, సిబ్బందిని తగ్గించడం వంటి చర్యలకు దిగుతున్నాయి. ఈ నేపథ్యంలో జరుపుకుంటున్న మేడే కార్మికవర్గ ఐక్యతను మరింతగా ముందుకు తెచ్చింది. మహమ్మారి విస్తృతంగా వ్యాపిస్తుండటంతో, కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది మేడేకు భారీ సమీకరణలు చేయకూడదని నిర్ణయించాం. ఎక్కడికక్కడ పరిమితసంఖ్యలో , భౌతిక దూరాన్ని పాటిస్తూ మే డే కార్యక్రమాలను నిర్వహించాలని సూచించాం.

**ప్ర: ప్రభుత్వాలు ఎలా స్పందిస్తున్నాయి?**

జ: కష్టకాలంలో ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను పెద్ద ఎత్తున ముందుకు తీసుకువస్తోంది. కార్పొరేట్ల కోసం కార్మిక చట్టాలను కుదించి నాలుగు కోడ్‌లగా మారుస్తోంది. వీటిలో భాగంగా ఎనిమిది గంటల పనిగంటలను 12 గంటలకు మార్చనుంది, దీనిని సాధ్యమైనంత త్వరగా అమలు చేయడానికి ప్రయత్నిస్తోంది. వీటిని ప్రతిఘటించి. హక్కులను కాపాడుకోవాంటే విశాల ప్రాతిపదికన జరిగే ఐక్య పోరాటాలే మార్గం. కార్మికవర్గ ఐక్యత మాత్రమే అటువంటి పోరాటాలకు బాటలు వేస్తుంది.

**ప్ర: లాక్‌డౌన్ సమయంలో కార్మికులకు తక్షణం ఎటువంటి సాయం అందాలి?**



జ: బియ్యం, పప్పు, కేంద్రం రూ.500, రాష్ట్రం రూ.1,000 ఇచ్చి 'అంతా' సరిపోయేలా ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంటున్నారు. మిగతా నిత్యావసరాల మాటేమిటి.? కేరళ ప్రభుత్వం నెల రోజులకు సరిపడేలా 17 రకాల సరుకులతో కూడిన కిట్ ఇచ్చింది. కేరళ, ఢిల్లీ ప్రభుత్వాలు రూ.5 వేలు నగదు ఇచ్చాయి. అసంఘటితరంగ కార్మికులను ఆదుకోవాలి. పేదల పట్ల ఇంత దుర్మార్గంగా వ్యవహరించడం సరి కాదు. వలస కార్మికులను కూడా పట్టించుకోవడం లేదు. వారిని తక్షణం సొంత ప్రాంతాలకు చేర్చాలి. అవసరమైన ఇతర సహాయాలను అందించాలి.

**ప్ర : లాక్‌డౌన్ కాలాన్నీ సిక్‌లీవ్‌గా పరిగణించి 50 శాతం జీతం ఇఎస్ఐ ద్వారా చెల్లించడానికి ప్రభుత్వాలు ఉత్తర్వులు ఇవ్వచ్చని చర్చ జరుగుతోంది.. మీరేమంటారు?**

జ : ఇఎస్ఐ డైరెక్టరేట్ బోర్డులో నిర్ణయం చేయాలి. మామూలుగా డాక్టర్ సర్టిఫై చేస్తేనే ఇఎస్ఐ నుంచి సిక్ లీవ్‌గా పరిగణించి వేతనం ఇస్తారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం నిర్ణయం చేయాలి. ప్రత్యేక ఆర్డినెన్స్ తెచ్చి ఉత్తర్వులివ్వాలి.

**ప్ర : లాక్‌డౌన్ నేపథ్యంలో కోట్లాది మంది ఉపాధి కోల్పోయే ప్రమాదాలున్నాయని ఆర్థిక వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది వాస్తవమేనా?**

జ : 6.5 శాతం ఉన్న గ్రోత్ రేట్ 1.6కు పడిపోతుందని ఐఎంఎఫ్ చెబుతోంది. గ్రోత్ రేట్ ఒక శాతం తగ్గితే లక్షలాది ఉద్యోగాలుపోతాయి. గ్రోత్ రేటు దాదాపు ఐదుకు తగ్గిపోవడం వల్ల కోట్లాది ఉద్యోగాలు తగ్గిపోయి ఆందోళనకర పరిస్థితులు ఉంటాయి.

**ప్ర : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?**

జ : ఆర్థిక మాంద్యం వల్ల కోట్లాది మందికి ఉపాధిపోతుంది. కార్మికుల, పేదల కొనుగోలు శక్తి తగ్గిపోతుంది. కార్మికులను, పేదలను ప్రభుత్వాలు ఆదుకోవాలి. డబ్బులు ఇచ్చి కొనుగోలు శక్తి పెంచితేనే పరిస్థితి మెరుగుపడుతుంది. కేంద్రం బడా కంపెనీలకు డబ్బు ఇస్తుంది కానీ, పేదలకు ఇవ్వదు. ప్రజలకు డబ్బులు వచ్చే పథకాలు ప్రవేశ పెట్టాలి. అప్పుడు ఆర్థిక పరిస్థితి నిలదొక్కుకుంటుంది. దీనికి భిన్నంగా కేంద్రం దాడి ప్రారంభమైంది. వచ్చే జులై వరకూ కరువు భత్యం ఉండదట. రిటైర్‌మెంట్ వయస్సు తగ్గిస్తారట. రాష్ట్ర ప్రభుత్వం కూడా 50 శాతం జీతాలు అనడం సరైంది కాదు. రాష్ట్రంలో 50 లక్షల మంది అసంఘటిత రంగ కార్మికులు ప్రభుత్వం ఆదుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం వద్ద భవన నిర్మాణ కార్మికుల సెస్సు రూ.450 కోట్లు ఉంది. ఈ నిధులతో తొమ్మిది లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలను ఆదుకోవచ్చు. పాక్షికంగా సడలించాక జూట్ మిల్లుల లాక్‌డౌన్ ఎత్తివేయాలి. ఇలాంటి పరిశ్రమల్లో పని చేసే కార్మికులకు వేతనాలు గ్యారంటీ చేయాలి. పని ప్రదేశాల్లో భౌతిక దూరం పాటించేలా చూడాలి. శానిటైజర్లు, ఇతర సౌకర్యాలు మెరుగుపరచాలి. కంటైన్‌మెంట్, రెడ్‌జోన్ ప్రాంతాల్లో ఉండే కార్మికులు పరిశ్రమల వద్దనే నివాసం ఉండేలా యాజమాన్యాలు ఏర్పాట్లు చేయాలి.

## విశాఖలో శ్రీశ్రీ జయంతి..

ప్రజాశక్తి-మద్దిలపాలెం, కలెక్టరేట్, విశాఖ



శ్రీశ్రీ 110వ జయంతి కార్యక్రమాన్ని విశాఖలో పలు చోట్ల గురువారం ఘనంగా నిర్వహించారు. మద్దిలపాలెం సిఐటియు కార్యాలయంలో సాహితీ స్రవంతి అధ్యక్షులు ఎవి.రమణా రావు అధ్యక్షతన నిర్వ హించిన కార్యక్రమంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, సాహితీ స్రవంతి నాయకులు చలపతి రావు శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అజశర్మ మాట్లాడుతూ మహాకవి శ్రీశ్రీ ఆకాంక్షించే సోషలిజం రావాలన్నారు. జగదాంబ సెంటర్ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో యూనియన్ విశాఖ నగర ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు పూలమాలవేసి నివాళులర్పించారు. భీమిలిలో ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యాన ఆ సంస్థ కార్యాలయంలో శ్రీశ్రీ జయంతిని నిర్వహించారు.

## బాలికపై వృద్ధుడు అత్యాచారం

ప్రజాశక్తి - నాదెండ్ల (గుంటూరు జిల్లా)

పదేళ్ల బాలికపై వద్ధుడు అత్యాచారం చేసిన సంఘటన గుంటూరు జిల్లా నాదెండ్ల మండలంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని చందవరం గ్రామానికి చెందిన బాలిక తల్లిదండ్రులు మిర్చి కోతలకు వెళ్లారు. అదే గ్రామానికి చెందిన ప్రయివేటు బస్సులో కండక్టర్‌గా పనిచేసే 56 ఏళ్ల గారపాటి ప్రకాశం ఒంటరిగా ఉన్న బాలికపై కన్నేశాడు. కొనుక్కునేందుకు డబ్బులు ఇస్తానని ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. బాధితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## అప్పల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - నాదెండ్ల (గుంటూరు జిల్లా)

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గుంటూరు జిల్లా నాదెండ్ల మండలం చందవరం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. నాదెండ్ల ఎస్ఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.... చందవరం గ్రామానికి చెందిన గొర్రెపాటి నాగేశ్వరరావు (40) తనకున్న ఎకరం పొలంతో పాటు ఏడు ఎకరం కౌలుకు తీసుకుని మిర్చి పంటను సాగు చేశాడు. పంటలో సరైన దిగుబడి రాకపోవడంతో రూ.15 లక్షల వరకు అప్పులయ్యాయి. చేసిన అప్పులు తీర్చే మార్గంలేక గురువారం ఉదయం తన పొలం వద్ద ఉన్న బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## నేడు సిక్కోలుకు మత్స్యకారులు

### గుజరాత్ నుండి శ్రీకాకుళానికి

### 54 బస్సుల్లో 4,068 మంది

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

లాక్‌డౌన్ కారణంగా గుజరాత్‌లో చిక్కుకున్న మత్స్యకారులు శుక్రవారం సాయంత్రం శ్రీకాకుళం జిల్లా సిక్కోలు చేరుకోనున్నారు. గుజరాత్‌లోని వీరావల్ నుంచి 54 బస్సుల్లో 4,068 మంది జిల్లాకు చేరుకోనున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, ఒడిశాకు చెందిన వీరందరి కోసం జిల్లాలోని రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల, గార, నరసన్నపేట, పోలాకి మండలాల్లో ఉన్నత పాఠశాలలు, కెజిబివి వసతిగృహాలు, కళాశాలల్లో వంటి 28 కేంద్రాల్లో వసతులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే అక్కడ మెరుగైన వసతులు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఒక్కోచోట కనీసం 40 మంది నుంచి గరిష్టంగా 200 మందిని ఉంచేందుకు ఏర్పాట్లు చేశారు.

**రూ.మూడు కోట్లు విడుదల**

గుజరాత్ నుంచి మత్స్యకారులను తీసుకొస్తున్న నేపథ్యంలో రవాణ ఛార్జీల నిమిత్తం రూ.మూడు కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం జిఓ నెంబరు 438ను విడుదల చేసింది.

## ఆ'కలి'కాలంలో చేయూత

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కూరగాయలు, భోజనం అందజేత

ప్రజాశక్తి-యంత్రాంగం

కరోనా వైరస్ వ్యాప్తి నివారణలో భాగంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విధించిన లాక్‌డౌన్ కారణంగా అవస్థలు పడుతున్న పేదలు, వలసకూలీలు, నిరాశ్రయులకు సిపిఎం, సిఐటియు, ఎస్ఎఫ్ఐ, పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆహారం, నిత్యావసర వస్తువులు, మాస్కులు,శానిటైజర్లను గురువారం పంపిణీ చేశారు.

ప్రకాశం జిల్లా చీమకుర్తిలో పారిశుధ్య కార్మికులకు అల్పాహారం అందించారు. ఐద్వా ఆధ్వర్యంలో సంతనూతలపాడులోని కామేపల్లివారి పాలెం,ఎస్‌టి కాలనీల్లో మాస్కులు, పొదిలిలో పేదలకు మాస్కులు పంపిణీ చేశారు. నెల్లూరు జిల్లాలో వెంకటేశ్వరపురం, భగత్ సింగ్ కాలనీలో 500 మంది పేదలకు కూరగాయలు అందించారు. 27వ డివిజన్‌లో డ్రైవర్స్ కాలనీలో నిరుపేదలకు బియ్యం,నిత్యావసర వస్తువులు,స్థానిక బొల్లినేని సెంటర్‌లో ఆహారం పంపిణీ చేశారు.

కర్నూలు జిల్లా ఆదోని ప్రభుత్వాస్పత్రిలో రోగులకు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆహారం అందించారు. నగరంలోని రెవెన్యూ కాలనీ, సోమిశెట్టి నగర్‌లో గౌండలు, ఆటో కార్మికులు, దినసరి కూలీలకు సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటస్వామి, మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభాన్, మహిళా సంఘం నాయకురాలు సీతమ్మ పాల్గొన్నారు. నంద్యాల పట్టణంలో బుడగ జంగాలకు కూరగాయలు అందించారు. అనంతపురంలో నవయుగ కాలనీ, ఆటో కాలనీ, శ్రీశ్రీ నగర్‌లో, ఆహారం, రాగిమాల్ట్ పంపిణీ చేశారు. ఉరవకొండలోని ఇందిరాగాంధీ నగర్‌లో ప్రజలకు అరటిపండ్లు, నార్పలలో ఐదు కిలోల బియ్యం, కూరగాయలు పంపిణి చేశారు. కడప జిల్లా బ్రహ్మంగారి మఠంలో 275 మంది పేదలకు అల్పాహారం అందించారు. పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం మండలం నాగులగూడెంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన పేదలకు కూరగాయలు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. టి.నరసాపురం మండలంలోని అల్లూరి సీతారామరాజు నగర్ వాసులకు, వలస కూలీలకు 60 కుటుంబాలకు గుడ్లు, కూరగాయలు, నిత్యావసర వస్తువులు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. సాలిగూడెంలో కూరగాయలు అందించారు. శ్రీకాకుళం నగరంలోని ఇందిరానగర్ కాలనీలోని అసంఘటిత రంగ కార్మికులకు, పేదలకు మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం ఆధ్వర్యాన బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. తూర్పుగోదావరి జిల్లా ఇంద్రపాలెం అర్జున్ నగర్, శ్రీనివాస నగర్ ఏరియాలో 150 మంది పేదలకు భోజనం అందించారు. ఆత్రేయపురంలో 160 మంది భవన నిర్మాణ సంఘం నాయకులు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. విశాఖ నగరంలోని అప్పన్నకాలనీ, తుంగ్లాం, అంబేద్కర్ కాలనీ, పూర్ణామార్కెట్, మారికవలస, జైభీమ్ నగర్ కాలనీ, దేశపాత్రునిపాలెం ప్రాంతాల్లో ఆహార పొట్లాలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. విజయవాడలో 63,64 డివిజన్లలో పేదలకు భోజనం అందించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి సిహెచ్. బాబూరావు పాల్గొన్నారు. పెనమలూరు మండలం తాడిగడపలో 250 మంది కూలీలకు భోజనం అందించారు.

**యుటిఎఫ్.. :** అనంతపురం జిల్లా పెనుకొండలో మున్సిపల్ కార్మికులకు నిత్యావసర సరుకులు అందించారు. పశ్చిమగోదావరి జిల్లా జీలుగుమిల్లి మండలం రామన్నపాలెంలో నాలుగు వందల కుటుంబాలకు బియ్యం, కూరగాయలు, తణుకులో పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులను అందజేశారు.



శ్రీకాకుళంలో నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న సిఐటియు నాయుకులు

## క్వారంటైన్‌లలో సౌకర్యాలు కల్పించాలి

### ముఖ్యమంత్రికి సిపిఎం లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గుంటూరు జిల్లా నర్సరావుపేటకు సంబంధించిన కరోనా క్వారంటైన్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు ముఖ్యమంత్రికి గురువారం లేఖ రాశారు. నర్సరావుపేట ఏరియాలో రోజురోజుకు పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయని, ఇప్పటికే 115 కేసులు నమోదయ్యాయని తెలిపారు. చుట్టుపక్కల నియోజకవర్గాలు వినుకొండ, ముప్పాళ్ళ, పిడుగురాళ్ళ వైపు కూడా కరోనా విస్తరిస్తున్నట్లు తెలుస్తుందన్నారు. నర్సరావుపేటలో వైరస్ విస్తరణను నివారించడానికి తీసుకున్న చర్యల్లో భాగంగా తిరుమల, నర్సరావుపేట, ఈశ్వర్, మిట్టపల్లి ఇంజనీరింగ్ కళాశాలలను, కోటప్పకొండ సత్రాన్ని, డిఆర్‌డిఎ కార్యాలయాన్ని క్వారంటైన్ కేంద్రాలుగా ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఈ ఆరు కేంద్రాల్లో పదుల సంఖ్యలో ప్రజలను పెట్టారని తెలుస్తుందన్నారు. వీరికి సక్రమంగా భోజన సౌకార్యలు లేవని, ఈ కేంద్రాల్లో ఉన్న ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని వివరించారు. అధికారులు విఫలమయ్యారని, ప్రతి క్వారంటైన్ సెంటర్‌కూ సరిపడా సిబ్బందిని నియమించలేదని ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. భవనాల్లో పారిశుధ్యం సరిగ్గా లేదని ఫిర్యాదు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో పాజిటివ్ వచ్చిన పేషెంట్లను ఉంచిన ఐసోలేషన్ సెంటర్‌లో నాణ్యత లేని ఆహారం, శుభ్రత లేని మంచి నీటిని అందిస్తున్నారని పేషెంట్లు తీవ్ర నిరసన తెలియజేశారని తెలిపారు. సంబంధించిన వీడియోని బయటికి పంపినా ప్రభుత్వం, అధికార్లు ఎటువంటి చర్యలూ తీసుకోలేదని పేర్కొన్నారు. ఈ పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని, వీటిని సరిదిద్దుతారని ఆశిస్తున్నామని తెలిపారు. లేఖ కాపీని వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శికి, గుంటూరు జిల్లా కలెక్టర్లకు కూడా పంపారు.

## రూ.3 వేల కోట్లతో 8 ఫిషింగ్ హార్బర్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో చేపల వేటకు అవసరమైన సదుపాయాల కల్పనలో భాగంగా ఎనిమిది ఫిషింగ్ హార్బర్లు, ఒక ఫిష్ ల్యాండ్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం మత్స్య శాఖపై సిఎం జగన్‌మోహన్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. సమీక్ష వివరాలను మీడియాకు మంత్రి మోపిదేవి వెంకటరమణ వెల్లడించారు. దీనికోసం రూ.3 వేల కోట్లతో అంచనాలు రూపొందించినట్లు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా మంచినీళ్లపేటలో ఫిష్‌ల్యాండ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదే జిల్లా బడగట్లపాలెం, విశాఖజిల్లా పూడిమడక, పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం, కృష్ణాజిల్లా మచిలీపట్నం, గుంటూరు జిల్లా నిజాంపట్నం, ప్రకాశం జిల్లా కొత్తపట్నంలో ఫిషింగ్ హార్బర్లు ఏర్పాటు చేయనున్నామని పేర్కొన్నారు. వీటితోపాటు నెల్లూరు జిల్లా జువ్వలదిన్నెలోనూ నిర్మించనున్నారు. రాష్ట్ర మత్స్యకారులు చేపల వేటకోసం ఇతర ప్రాంతాలకు వలస పోరాదనే వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

## రిలయన్స్ కంపెనీలో వేతనాల కోత

- రూ.39,354 కోట్ల నికర లాభాలు

**ముంబయి :** లాక్‌డౌన్ కొనసాగుతున్న వేళ కూడా రిలయన్స్ ఇండస్ట్రీస్ విలువ భారీగా పెరుగుతున్నప్పటికీ.. ఆ కంపెనీ మాత్రం తమ ఉద్యోగుల వేతనాల్లో భారీగా కోత పెడుతూ అనుహ్య నిర్ణయం తీసుకుంది. రిలయన్స్ హైడ్రోకా ర్బన్స్ బిజినెస్‌కు సంబంధించిన సీనియర్ ఉద్యోగుల జీతాల్లో కోత విధిస్తున్నట్లు రిలయన్స్ గురువారం వెల్లడించింది. అయితే సంవత్సరానికి రూ.15 లక్షల కన్నా తక్కువ వేతనం కలిగిన ఉద్యోగులకు ఈ కోత ఉండదని తెలిపింది. రిలయన్స్ ఇండ స్ట్రీస్ ఛైర్మన్, అపార కుబేరుడు ముకేశ్ అంబానీ తన వార్షిక వేతనాన్ని వదులు కోనున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది. అంబానీ 2020-21 సంవత్సరానికి తాను వేతనం తీసుకోవడం లేదని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హిటల్ ఆర్ మెస్వానీ వెల్లడించారు. అదే విధంగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, ఇతర సీనియర్ ఉద్యోగులు సహా రిఫరింగ్ బోర్డు డైరెక్టర్లు 30-50 శాతం వదులుకుంటారని తెలిపారు. మొదటి త్రైమాసికంలో సాధారణంగా చెల్లించే వార్షిక నగదు బోనస్, ఇతర ప్రోత్సాహకాల చెల్లింపును కూడా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. పెట్రో కెమికల్స్ డిమాండ్ తగ్గడం వల్ల హైడ్రోకార్బన్స్ వ్యాపారం బాగా ప్రభావితం కావడంతో.. ఖర్చుల తగ్గింపు అవసరమని భావించామన్నారు. బ్లూమ్‌బర్గ్ ఆసియా కోటీశ్వరుల జాబితాలో ఇప్పటి వరకు ప్రథమ స్థానంలో ఉన్న అలీబాబా గ్రూపు అధినేత జాక్ మా స్థానాన్ని ఇటీవలే ముకేశ్ అధిగమించారు. ఇక ప్రపంచవ్యాప్తంగా అత్యంత ధనవంతుల జాబితాలో ముఖేశ్ అంబానీ 17వ స్థానంలో ఉండగా.. జాక్ మా 19వ స్థానంలో నిలిచారు. రిలయన్స్ అనుబంధ సంస్థ జియోలో 9.99 శాతం వాటాను సోషల్ మీడియా దిగ్గజం ఫేస్‌బుక్ కొనుగోలు చేయడంతో అంబానీ సంపద 4.7 బిలియన్ డాలర్లు పెరిగి ఒకేసారి 49.2 బిలియన్ డాలర్లకు చేరిన విషయం తెలిసిందే.

2020 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఏకంగా రూ.39,354 కోట్ల నికర లాభాలు నమోదు చేసినట్లు వెల్లడించింది. ఇంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఈ లాభాలు రూ.39,588 కోట్లుగా ఉన్నాయి. నిధుల సమీకరణ కోసం కాగా కొత్తగా రూ.53,125 కోట్ల రైట్ ఇష్యూను ప్రకటించింది. 2020 మార్చి 31 నాటికి ఈ కంపెనీ రూ.3,36,294 కోట్ల అప్పులు చెల్లించాల్సి ఉంది.

## లాక్‌డౌన్ పొడిగిస్తే ఆకలి చావులే..

- ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు ఆందోళన

**బెంగళూరు :** దేశంలో లాక్‌డౌన్‌ను పొడగిస్తే కరోనా చావుల కంటే ఆకలి మరణాలే ఎక్కువగా నమోదయ్యే అవకాశాలున్నాయని ప్రముఖ ఐటి కంపెనీ ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు ఎన్ఆర్ నారాయణ మూర్తి అన్నారు. ప్రస్తుత పరిస్థితి ఎక్కువ కాలం కొనసాగితే అనధికారిక లేదా అసంఘటిత రంగంలోని కార్మికులు చాలామంది తమ ఉద్యోగా లను కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో సుమారు 19 కోట్ల మంది అసంఘటిత, స్వయం ఉపాధి వల్ల ఉపాధి పొందుతున్నారన్నారు. లాక్‌డౌన్ భవిష్యత్తులోనూ కొనసాగితే వీరంతా జీవనాధారం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. వ్యాపారులు సైతం 15 నుంచి 20 శాతం ఆదాయం నష్టపోవచ్చని అంచనా వేశారు. దీనివల్ల అంతిమంగా ప్రభుత్వానికి రావాల్సిన పన్నులు, జిఎస్‌టి వసూళ్లపై ప్రభావం పడుతుంద న్నారు. అనేక అభివద్ధి చెందిన దేశాల కంటే భారతదేశ మరణాల రేటు చాలా తక్కువగా ఉన్నప్పటికీ, లాక్‌డౌన్ ఆంక్షలను ఎక్కువ కాలం కొనసాగించే అవకాశం లేదని అభిప్రా యపడ్డారు. భారత్ లాంటి దేశాలు లాక్‌డౌన్‌ను కొనసాగించే పరిస్థితులు లేవన్నారు. లాక్‌డౌన్ పొడిగిస్తే వీరంతా మరింత సంక్షోభంలోకి కూరుకు పోతారని మూర్తి హెచ్చరించారు.

## బెంగాల్లో మే చివరి వరకు లాక్‌డౌన్

**కోల్‌కతా :** రాష్ట్రంలో లాక్‌డౌన్‌ను మే చివరి వరకు పొడిగిస్తున్నట్లు పశ్చిమబెంగాల్ ప్రభుత్వం ప్రకటించింది. గ్రీన్‌జోన్‌లలో సోమవారం నుండి చిన్న దుకాణాలు, ఎంపిక చేసిన కొన్ని రంగాలు తమ వ్యాపారాలను ప్రారంభించడానికి అనముతిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెలిపారు. అయితే కరోనా కేసులు పెరిగినట్లయితే.. వాటిని కూడా మూసివేస్తామని అన్నారు. జాబితా చేసిన కొన్ని రంగాలకు మాత్రం లాక్‌డౌన్ కొనసాగుతుందని మీడియాకు తెలిపారు. గత 24 గంటలో 33 పాజిటివ్ కేసులు నమోదయ్యాయని, కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయని, మొత్తం 1,397 మందిని పరీక్షించగా, 119 మంది డిశ్చార్జ్ అయ్యారని రాష్ట్ర పరిపాలన విభాగం పేర్కొంది.

LAURUS Labs
Knowledge . Innovation . Excellence

**Laurus Labs Limited**

**Regd.Office:** Plot No.21, Jawaharlal Nehru Pharma City, Parawada, Visakhapatnam 531 021, Andhra Pradesh, India.
**Corp.Office:** 2nd Floor, Serene Chambers, Road No.7, Banjara Hills, Hyderabad 500034, Telangana, India.
Tel: +91 40 3980 4333 ; Fax : +91 040 3980 4320 ; E-mail: secretarial@lauruslabs.com; Website: www.lauruslabs.com
**(CIN: L24239AP2005PLC047518)**

Extract of Audited Consolidated Financial Results of Laurus Labs Limited for the year ended March 31, 2020 and Unaudited Consolidated Financial Results for the quarter ended March 31, 2020 which are prepared in compliance with Indian Accounting Standards.

(Rs. in million)

| Sl. No | Particulars | Quarter ended | | | Year ended | Year ended |
|---|---|---|---|---|---|---|
| | | 31-Mar-20 | 31-Dec-19 | 31-Mar-19 | 31-Mar-20 | 31-Mar-19 |
| 1 | Total revenue from operations | 8,391.42 | 7,295.89 | 6,351.61 | 28,317.23 | 22,919.16 |
| 2 | Net Profit for the period (before tax, Exceptional and/or Extraordinary items) | 1,267.39 | 817.12 | 525.69 | 2,936.11 | 1,197.52 |
| 3 | Net Profit for the period before tax (after Exceptional and/or Extraordinary items) | 1,267.39 | 817.12 | 525.69 | 2,936.11 | 1,197.52 |
| 4 | Net Profit for the period after tax (after Exceptional and/or Extraordinary items) | 1,101.50 | 734.75 | 431.79 | 2,552.73 | 937.64 |
| 5 | Total Comprehensive Income for the period | 981.52 | 735.75 | 441.08 | 2,438.95 | 900.90 |
| 6 | Equity Share Capital | 1,069.14 | 1,069.14 | 1,064.37 | 1,069.14 | 1,064.37 |
| 7 | Reserves (excluding Revaluation Reserve) as shown in the Audited Balance Sheet | | | | 16,628.64 | 14,519.70 |
| 8 | Earnings Per Share (of Rs:10 /- each) | | | | | |
| | 1. Basic : Rs * | 10.32 | 6.88 | 4.07 | 23.93 | 8.83 |
| | 2. Diluted : Rs * | 10.32 | 6.88 | 4.05 | 23.93 | 8.80 |

* Not annualised for quarter ended

Notes :

1. Additional information on Audited standalone financial results for the year ended March 31, 2020 and Unaudited financial results for the quarter ended March 31, 2020

(Rs. in million)

| Sl. No | Particulars | Quarter ended | | | Year ended | Year ended |
|---|---|---|---|---|---|---|
| | | 31-Mar-20 | 31-Dec-19 | 31-Mar-19 | 31-Mar-20 | 31-Mar-19 |
| 1 | Total revenue from operations | 8,292.25 | 7,209.92 | 6,176.37 | 27,973.35 | 22,361.48 |
| 2 | Profit before tax | 1,289.48 | 859.26 | 544.48 | 3,044.82 | 1,212.19 |
| 3 | Profit after tax | 1,125.25 | 779.52 | 439.48 | 2,670.47 | 949.94 |
| 4 | Total Comprehensive Income for the period | 1,019.38 | 779.19 | 448.95 | 2,574.28 | 919.24 |

2. The above is an extract of the detailed format of Quarterly/Year ended Financial Results filed with the Stock Exchanges under Regulation 33 of the SEBI (Listing and Other Disclosure Requirements) Regulations, 2015. The full format of the Quarterly/Year ended Financial Results are available on the websites of the Stock Exchanges and the Company namely www.bseindia.com, www.nseindia.com and www.lauruslabs.com
3. The above financial results of the Company as reviewed by the Audit Committee has been approved by the Board of Directors at its meeting held on April 30, 2020.

By order of the Board
For **Laurus Labs Limited**

Place : Hyderabad
Date : April 30, 2020

**Dr. Satyanarayana Chava**
Whole Time Director & Chief Executive Officer